7

సాక్షి విశాఖపట్నం

శుక్రవారం । 30 । మే । 2025



ప్రేక్షకుల రుణం తీర్చుకునే చిత్రం 'థగ్‌లైఫ్'

- వైజాగ్ నాకు సొంతిల్లు లాంటిది
- సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో కమల్ హాసన్

8లో



మెరిసిన జ్యోతి

ఆసియా అథ్లెటిక్స్‌లో స్వర్ణంతో చరిత్ర సృష్టించిన విశాఖ అమ్మాయి 8లో

న్యూస్‌రీల్

రేపు 3 వేల మందితో సూర్య నమస్కారాలు



మహారాణిపేట: అంతర్జాతీయ యోగా దినోత్సవ సన్నాహకాల్లో భాగంగా ఆయుష్ విభాగం, జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో శనివారం మూడు వేల మంది సూర్య నమస్కారాలు చేయనున్నట్టు ఆయుష్ విభాగం రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ఝాన్సీ లక్ష్మీబాయి తెలిపారు. ఆర్.కె.బీచ్ రోడ్‌లోని కాళీమాత ఆలయం ముందు భాగంలో ఆ రోజు ఉదయం 6 గంటల నుంచి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. నగర ప్రజలు, వివిధ సంస్థల సభ్యులు స్వచ్ఛందంగా కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

జూన్ 25 వరకు అనాథ బాలల గుర్తింపు సర్వే

విశాఖ లీగల్: ఉమ్మడి విశాఖ జిల్లాలోని అనాథ, నిరాశ్రయ బాలలను గుర్తించి, వారికి ఆధార్ కార్డులు అందించేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు కలిసి పనిచేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షుడు చిన్నంశెట్టి రాజు సూచించారు. వీరి గుర్తింపు కోసం ఈ నెల 25న సర్వే ప్రారంభమైందని, వచ్చే నెల 25వ తేదీ వరకు కొనసాగుతుందని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అనాథలు, నిరాశ్రయులైన పిల్లలను తహసీల్దార్ల ద్వారా గుర్తించి.. అనంతరం వారికి ఆధార్ కార్డులు ఇప్పిస్తామని ఆయన వెల్లడించారు. ఈ ప్రక్రియకు అన్ని శాఖలు సహకరించాలన్నారు. అనాథలు లేదా నిరాశ్రయులైన పిల్లల సమాచారం తెలిస్తే తమకు తెలియజేయాలని సంస్థ జిల్లా కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు కోరారు.

వర్షాలతో భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు



ప్రసాదాల నిల్వశాలను పరిశీలిస్తున్న ఈవో త్రినాథరావు

సింహాచలం: ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా సింహగిరికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చేయాల్సిన ఏర్పాట్లపై దేవస్థానం ఈవో వి.త్రినాథరావు గురువారం పరిశీలించారు. స్వామి దర్శనానికి భక్తులు వెళ్లే ఉచిత, రూ.100, రూ.300 క్యూల్లో నడుస్తూ ఎక్కడెక్కడ వర్షం నీరు వస్తోందో ఆయా ప్రాంతాలను గుర్తించారు. నీరు భక్తులపై పడకుండా ఏర్పాట్లు చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. ప్రసాదాల విక్రయశాలకు వెళ్లి, సిబ్బంది పనితీరును పర్యవేక్షించారు. భక్తులతో మర్యాదపూర్వకంగా మాట్లాడాలని సూచించారు. ప్రసాదాల నిల్వ గది ఇరుగ్గా ఉండటంతో, ప్రత్యామ్నాయ గదిలోకి మార్చాలన్నారు. ప్రసాదాల నాణ్యతలో అలసత్వం ప్రదర్శించవద్దని హెచ్చరించారు. ఆయన వెంట దేవస్థానం ఈఈ రాంబాబు, డీఈ హరి, ఏఈవో పిళ్లా శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ జీవీవీఎస్‌కే ప్రసాద్, పీఆర్వో నాయుడు పాల్గొన్నారు.

ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కు అదనపు కోచ్

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా భువనేశ్వర్–బెంగళూరు–భువనేశ్వర్ మధ్య నడుస్తున్న ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కు థర్డ్ ఏసీ కోచ్‌ను అదనంగా జత చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. భువనేశ్వర్–కేఎస్ఆర్ బెంగళూరు(18463) ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు, కేఎస్ఆర్ బెంగళూరు–భువనేశ్వర్(18464) ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ ఈ నెల 30 నుంచి జూన్ 1 వరకు అదనపు థర్డ్ ఏసీ కోచ్‌తో రాకపోకలు సాగిస్తుంది.



ఇది అనకాపల్లి జిల్లా నాతవరం మండలం సిరిపురం గ్రామానికి ఏకంగా అటవీ మార్గంలో నిర్మించిన రహదారి. ఈ రహదారికి అటవీశాఖ నుంచి ఎటువంటి అనుమతి లేదు. ఏకంగా కొండలను తొలుస్తూ నిర్మించిన ఈ రోడ్డు కనీసం 10 కిలోమీటర్ల వరకు ఉంటుంది. ఏ అధికారి కూడా రోడ్డు నిర్మాణ సమయంలో తనిఖీ చేసింది లేదు. ఈ రోడ్డులో దర్జాగా లేటరైట్‌ను 40 లారీల్లో రోజుకు 120 ట్రిప్పుల్లో తరలిస్తున్నారు. ఈ లేటరైట్ విలువ రోజుకు రూ.2 కోట్ల పైమాటే.

ఇది అనకాపల్లి–చోడవరం మార్గంమధ్యలో ఉన్న బవులవాడ గ్రామ పరిధిలోని రావుగోపాలరావు నగర్ కాలనీ, జగనన్న కాలనీలను ఆనుకుని మొత్తం 3 కిలోమీటర్ల వరకు నిర్మించిన రోడ్డు. ఏకంగా కొండను తొలచి మరీ ఈ రోడ్డును నిర్మించారు. ఈ రోడ్డు నిర్మాణాన్ని అక్కడ క్వారీల యాజమాన్యాలే చేపట్టాయి. దీనిపై ఫిర్యాదులు వస్తే తూతూ మంత్రంగా విచారణ చేసి.. కనీసం ఇప్పటివరకు కేసు కూడా నమోదు చేయలేదు. ఇక్కడి నుంచి రోజుకు 1,000 ట్రిప్పుల బండరాళ్లను రాంబిల్లి వద్ద నిర్మిస్తున్న నేవల్ బేస్‌కు తరలిస్తున్నారు.





ఇది భీమిలి నియోజకవర్గం ఆనందపురం మండలం గిడిజాల గ్రామ పంచాయతీలోని సర్వే నెంబరు 258లోని స్థలం. ఇదే పంచాయతీలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి రిసార్ట్స్ నిర్మించిన ఓ ఘనుడు ఈ స్థలంలోని లక్షల టన్నుల గ్రావెల్‌ను తరలించి లే–అవుట్ యాజమాన్యాలకు విక్రయించాడు. ఇప్పుడు ఈ భూమిని ఆట స్థలానికి ఇవ్వాలంటూ స్థానికుల ద్వారా డిమాండ్లు పెట్టిస్తున్నాడు. ఈ డిమాండ్ వెనుక అక్రమంగా కొట్టేసిన గ్రావెల్ దందాను ప్రశ్నించకుండా ఉండడమే.

పెందుర్తి మండలంలోని నరవ గ్రామంలో ఎటువంటి అనుమతి లేకుండా ఏకంగా అటవీ శాఖ, ఏపీఐఐసీ భూముల్లో గ్రావెల్‌ను దర్జాగా కొల్లగొడుతున్నారు. అధికారులు మొదట్లో రోడ్డు మధ్యలో వాహనాలు వెళ్లకుండా గుంతను ఏర్పాటు చేస్తే దానిని పూడ్చి మరీ గ్రావెల్ తరలిస్తున్నారు. ఏమిటంటే అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యే అండదండలు ఉన్నాయని బెదిరింపులకు దిగుతున్నారు.



ఇవీ మచ్చుకు ఉమ్మడి విశాఖ జిల్లాలో జరుగుతున్న మైనింగ్ అక్రమాలకు సజీవ సాక్ష్యాలు. ఇంత దర్జాగా అక్రమ మైనింగ్‌తో పాటు అడ్డగోలుగా నిబంధనలు ఉల్లంఘిస్తున్నా అధికారులు మాత్రం కనీసం పట్టించుకోవడం లేదు. కూటమి నేతల హస్తం వీటి వెనుక ఉండటమే ఇందుకు కారణమనే విమర్శలున్నాయి. ఒక వేళ వీటిపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే వారిని ప్రలోభాలకు గురిచేస్తున్నారు. వినకుంటే బెదిరింపులకు దిగుతున్నారు.

అక్రమ మైనింగ్‌కు అడ్డులేకుండా కొత్త ఎత్తుగడ

రేషన్ కార్డుకు రూ. 1,500!

నెలవారీ మామూళ్లతో స్థానిక నాయకులకూ వల

- ప్రశ్నించే వారికి బెదిరింపులు
- ఏకంగా కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణం
- ఏ శాఖ నుంచీ అనుమతి లేదు
- కనీసం కన్నెత్తి చూడని అధికారులు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

మైనింగ్ మాఫియా కొత్త సంస్కృతికి తెర తీసింది. స్థానిక ప్రజలకు రేషన్ కార్డుకు రూ.1,500 చొప్పున అందజేసి ప్రలోభాలకు గురిచేస్తోంది. మైనింగ్ వ్యవహారంపై ఎటువంటి ఫిర్యాదులు చేయవద్దని షరతు విధిస్తోంది. ఎవరైనా ఫిర్యాదు చేసినా, పరిశీలించేందుకు వచ్చినా అడ్డుకోవాలని ఆదేశిస్తోంది. దీన్ని ఏ ఒక్కరూ జవదాటినా నెల నెలా ఇచ్చే రూ.1,500 మొత్తాన్ని నిలిపివేస్తామని బెదిరింపులకు దిగుతోంది. ఇదంతా కూటమి నేతల కనుసన్నల్లో జరుగుతోంది. ఇందులో భాగంగా నర్సీపట్నం, అనకాపల్లిలోని మైనింగ్ ప్రాంతాల్లో రేషన్ కార్డు ఉన్న ప్రతీ ఇంటికీ నెలకు రూ.1,500 చొప్పున ముట్టచెబుతున్నట్టు తెలుస్తోంది. అంతేకాకుండా ఒక స్థాయి నాయకులకు కూడా నెలవారీ మామూళ్లు ఇచ్చి ప్రలోభాలకు గురిచేసినట్లు సమాచారం. వీరికి నెలకు రూ. 10 వేల నుంచి రూ. 30 వేల వరకూ ముట్టచెబుతోంది. దీంతో పాటు అధికారులకు కూడా ట్రిప్పునకు ఇంత మొత్తం చొప్పున నెలవారీ మామూళ్లు అందుతుండటంతో.. ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా కనీసం అటువైపుగా చూడడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమ మైనింగ్ వ్యవహారంలో స్థానికంగా ఉన్న ప్రజల నుంచి వ్యతిరేకత రాకుండా రేషన్‌కార్డుకు రూ.1,500 చొప్పున అప్పగిస్తూ.. మైనింగ్ మాఫియా మాత్రం కోట్లలో అక్రమంగా ఆర్జిస్తోంది. దీర్ఘకాలంలో గ్రామానికి నష్టం వాటిల్లుతుందని ఎవరైనా ప్రశ్నిస్తే... రేషన్‌కార్డుపై ప్రతీ నెలా ఇచ్చే మొత్తం రాదంటూ స్థానికులను వారిపై రెచ్చగొడుతోంది. ఫలితంగా ఆయా గ్రామాల్లో స్థానికుల మధ్యనే కొట్లాట కుంపట్లను రాజేసి మైనింగ్ మాఫియా చలికాసుకుంటోంది.

కూటమి నేతలు ఫిర్యాదు చేసినా...!

- వాస్తవానికి మైనింగ్ వ్యవహారంలో కూటమి నేతల మధ్యనే వివాదాలు రాజుకుంటున్నాయి. ఇష్టారీతిలో సాగుతున్న మైనింగ్ వ్యవహారంపై కూటమి పార్టీలోని నేతలే ఫిర్యాదు చేసే పరిస్థితి ఏర్పడింది.
- చోడవరం నియోజకవర్గంలో లక్కవరం, గవరవరం, శేమునాపల్లి, వెంకన్నపాలెం, నరసాపురం, జుత్తాడ, భోగాపురం వంటి గ్రామాల్లో విచ్చలవిడిగా మైనింగ్ దందా జరుగుతోందని స్వయంగా జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు తహసీల్దారుతో పాటు విశాఖలోని విజిలెన్స్ ఎస్పీకి కూడా ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. శారదా నదిలోని ఇసుకను ఏ విధంగా ఇష్టారీతిలో తవ్వేస్తున్నారో కూడా ఫొటోలతో సహా వివరించారు. ఫిర్యాదుల పరంపర వారం రోజులుగా సాగుతున్నా.. చడీచప్పుడు లేకుండా పోయింది.
- పెందుర్తి నియోజకవర్గంలోని పెందుర్తి, సబ్బవరం మండలాల్లో సాగుతున్న గ్రావెల్ దందాపై కూడా కూటమి పార్టీలోని నేతలు ఆధారాలతో సహా ఫిర్యాదులు చేస్తున్నారు.
- భీమిలిలోనూ అదే పరిస్థితి ఉంది. కూటమి పార్టీల పేరుతో కబ్జాల ఘనుడు చేస్తున్న వ్యవహారంతో పాటు అక్రమంగా గ్రావెల్ తవ్వకాలపై కూడా ఫిర్యాదులు చేసినప్పటికీ ఫలితం ఉండటం లేదు.
- అనకాపల్లి జిల్లాలో కూడా నేరుగా అనుమతి లేని లారీలు పదుల సంఖ్యలో తిరుగుతున్నాయంటూ స్వయంగా ఎమ్మెల్యే అధికారులకు ఫిర్యాదు చేశారు. అనుమతి లేకుండా ఎలా తిరగనిస్తున్నారని నిలదీశారు. అయినప్పటికీ రెండు, మూడు రోజులు నిలిచిన వ్యవహారం ఇప్పుడు యథావిధిగా సాగుతూనే ఉంది.
- యలమంచిలి నియోజకవర్గంలోనూ ఎమ్మెల్యే అవినీతి వ్యవహారాలపై టీడీపీ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు నేరుగా ధ్వజమెత్తుతున్నారు. రాంబిల్లి వద్ద నిర్మిస్తున్న నేవల్ బేస్‌కు బండరాళ్ల తరలింపులో భారీగా అక్రమాలు జరుగుతున్నాయని.. అధిక లోడుతో అనేక వాహనాలు వస్తున్నాయని అక్కడి టీడీపీ నేతలు మండిపడుతున్నారు. ఇందులో ఎమ్మెల్యే భారీగా వాటాలు తీసుకుంటున్నారని కూడా పరోక్షంగా ధ్వజమెత్తుతున్నారు.
- ఇలా అన్ని నియోజకవర్గాల్లోనూ కూటమిలోని ఒక పార్టీ చేస్తున్న మైనింగ్ దందాను మరో పార్టీ నేతలు ప్రశ్నిస్తున్నారు. అయినప్పటికీ చర్యలు తీసుకోవడం లేదంటే కూటమి ప్రభుత్వంలో పరిస్థితి ఎంత అధ్వానంగా తయారైందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

ఇంజనీరింగ్ లీలలు!

- వీఎంఆర్‌డీఏ టెండర్లలో నిబంధనలకు తిలోదకాలు
- కూటమి నేతల లబ్ధికి అధికారుల తాపత్రయం
- 'ది డెక్' నిర్వహణకు సింగిల్ టెండర్.. అయినా ఓకే
- సీ హారియర్ నిర్వహణ టెండర్ దక్కించుకున్న సంస్థకు చెక్
- తమ వారికి దక్కలేదని టెండర్ రద్దు



విశాఖ సిటీ: విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ(వీఎంఆర్‌డీఏ) ఇంజనీరింగ్ అధికారుల లీలలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. నిబంధనలకు తిలోదకాలిస్తూ కూటమి ప్రజాప్రతినిధుల అనుచరులకు టెండర్లు కట్టబెట్టేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారు. అందుకు అనుగుణంగా టెండర్లలో రూల్స్ మార్చేస్తున్నారు. అంతటితో ఆగకుండా టెండర్ వేయొద్దని కాంట్రాక్టర్లకు ఫోన్ చేయడం.. తాజాగా వేరొక కాంట్రాక్టు సంస్థకు ఆ టెండర్ దక్కిందన్న అక్కసుతో దాన్ని రద్దు చేయడంపై దుమారం రేగుతోంది. అలాగే మరో నిర్వహణ పనులకు ఒకే టెండర్ దాఖలైనప్పటికీ.. వారికి కేటాయించడంతో ఇతర కాంట్రాక్టర్లు విస్తుపోతున్నారు.

సీ హారియర్ టెండర్ రద్దు

బీచ్ రోడ్డులోని సీ హారియర్ ఎయిర్ క్రాఫ్ట్ మ్యూజియం నిర్వహణ టెండర్‌ను అనుకున్నట్లుగానే అధికారులు రద్దు చేశారు. మ్యూజియం నిర్వహణ కోసం 11 నెలలకు గాను రూ.35.05 లక్షల అంచనా వ్యయంతో ఈ ఏడాది ఏప్రిల్‌లో వీఎంఆర్‌డీఏ ఇంజనీరింగ్ అధికారులు టెండర్లను ఆహ్వానించారు. ఈ నిర్వహణ పనిలో భారీగా ఆదాయం వచ్చే అవకాశముంది. దీంతో ఒక కాంట్రాక్టు సంస్థ అధికారులతో రహస్య ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఫలితంగానే ఈ మ్యూజియం టెండర్‌లో పాల్గొనవద్దని స్వయంగా ఇంజనీరింగ్ అధికారులే కాంట్రాక్ట్ సంస్థలకు చెప్పినట్లు వార్తలు వినిపించాయి. అయినప్పటికీ పలువురు ఇతర పేర్ల మీద టెండర్లు దాఖలు చేశారు. ఇందులో అత్యల్పంగా 15 శాతం తక్కువకు రూ.29,48,036కు ఒక సంస్థ టెండర్ వేసింది. ఆ తరువాత 9.09 శాతం తక్కువకు రూ.31,86,753కు మరో కాంట్రాక్టు సంస్థ దాఖలు చేసింది. వాస్తవానికి తక్కువకు టెండర్ వేసిన సంస్థకే పనులను అప్పగించాలి. కానీ ఇంజనీరింగ్ అధికారులు రెండో స్థానంలో ఉన్న సంస్థకు పనులు అప్పగించేందుకు ప్రయత్నించారు. అయితే ఆ సంస్థ తక్కువకు టెండర్ వేయకపోవడంతో వారి ఆశలు నిరాశయ్యాయి. దీంతో ఈ టెండర్‌ను వదులుకోవాలని తక్కువ బిడ్ చేసిన కాంట్రాక్టర్‌తో ఒప్పందం చేసుకోవడానికి ప్రయత్నించినప్పటికీ అది ఫలించనట్లు సమాచారం. ఫలితంగా తక్కువకు టెండర్ వేసిన కాంట్రాక్టు సంస్థకు వర్క్ ఆర్డర్ ఇవ్వకుండా తాత్సారం చేశారు. ఈ నేపథ్యంలో ఇంజనీరింగ్ అధికారుల తీరుపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఊహించినట్లుగానే ఈ టెండర్‌ను అధికారులు రద్దు చేశారు. అర్హత సాధించిన సంస్థ నిర్వాహకులకు కనీసం సమాచారం ఇవ్వకపోవడం గమనార్హం.

సింగిల్ టెండర్‌కే ఆమోదం

సిరిపురం జంక్షన్‌లో మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ అండ్ కమర్షియల్ బిల్డింగ్‌ను వీఎంఆర్‌డీఏ నిర్మించింది. త్వరలోనే ఈ భవనాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఈ భవన నిర్వహణకు 11 నెలలకు గాను రూ.1.33 కోట్లకు టెండర్లు ఆహ్వానించారు. ఇందులో పాల్గొనేందుకు అనేక కాంట్రాక్టు సంస్థలు ఆసక్తి చూపించాయి. కానీ ఈ పనులపై కూటమి ప్రజాప్రతినిధి కన్నేశారు. తమ అనుచరులకు ఈ టెండర్‌ను కట్టబెట్టేందుకు చక్రం తిప్పారు. అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి సదరు సంస్థకు అనుకూలంగా టెండర్ నిబంధనలను మార్చివేశారు. అంతేకాకుండా ఈ టెండర్ విషయంలో కూడా ఎవరూ దరఖాస్తులు దాఖలు చేయొద్దని కాంట్రాక్టర్లకు ఫోన్లు చేసినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ కాంట్రాక్టును ఇప్పటికే వీఎంఆర్‌డీఏలో మూడు భవనాల టెండర్లు దక్కించుకున్న సంస్థకే కట్టబెట్టాలని నిర్ణయించుకున్నారు. దీంతో ఈ పనులకు కేవలం ఒక టెండర్ మాత్రమే దాఖలైంది. నిబంధనల ప్రకారం సింగిల్ టెండర్‌ను తిరస్కరించాల్సి ఉంటుంది. కానీ ఇంజనీరింగ్ అధికారులు ఈ నిబంధన అమలు విషయంలో వింత భాష్యం చెపుతున్నట్లు సమాచారం. గ్లోబల్ టెండర్ల ద్వారా ఏ సంస్థ వచ్చినా ఆ భవనం నిర్వహణ అంత తేలికైన విషయం కాదని, అందుకే ఇక్కడి సంస్థకే అప్పగిస్తే నిర్వహణ బాగుంటుందని చెప్పి సింగిల్ టెండర్ వేసిన సంస్థకే పనులు అప్పగించడం విశేషం. దీనిపై ఉన్నతాధికారులు సైతం పట్టించుకోకపోవడం గమనార్హం. దీని వెనుక స్థానిక కూటమి ప్రజాప్రతినిధి హస్తం ఉండడంతోనే ఎవరూ ది డెక్ టెండర్‌పై నోరెత్తలేకపోతున్నారన్న చర్చ జరుగుతోంది.

టెన్షన్.. టెన్షన్!

- ఓ పక్క బదిలీలు, మరో పక్క పదోన్నతులు
- 86 మంది గ్రేడ్–2 హెచ్‌ఎంలకు బదిలీ ఉత్తర్వులు
- 75 మంది స్కూల్ అసిస్టెంట్లకు హెచ్‌ఎంలుగా ఉద్యోగోన్నతి
- సాంకేతిక చిక్కులతో రోస్టర్ కూర్పులో జాప్యం
- ఎస్‌ఏ, ఎస్జీటీల బదిలీలకు సిద్ధమైన సీనియార్టీ జాబితాలు

విశాఖ విద్య: విద్యాశాఖలో బదిలీల పర్వం మొదలైంది. గ్రేడ్–2 ప్రధానోపాధ్యాయులకు బదిలీ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో పనిచేస్తున్న 86 మందికి స్థానచలనం కలిగింది. వెబ్ ఆప్షన్స్‌లో హెచ్‌ఎంలు కోరుకున్న పాఠశాలల్ని కేటాయిస్తూ బదిలీ ఉత్తర్వులు జారీ అయ్యాయి. బదిలీల షెడ్యూల్‌లో భాగంగా గురువారం జిల్లా విద్యాశాఖాధికారులు స్కూల్ అసిస్టెంట్లకు గ్రేడ్–2 హెచ్‌ఎంలుగా ఉద్యోగోన్నతి కల్పించేందుకు నగరంలోని ఎస్ఎఫ్ఎస్ స్కూల్ ఆవరణలో కౌన్సెలింగ్ నిర్వహించారు. జోన్–1 పరిధిలోకి వచ్చే ఉత్తరాంధ్ర జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో 8 మంది స్కూల్ అసిస్టెంట్లకు గ్రేడ్–2 హెచ్‌ఎంలుగా ప్రమోషన్ కల్పించారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 1, జిల్లా పరిషత్ మేనేజ్‌మెంట్ పరిధిలోని 66 మంది స్కూల్ అసిస్టెంట్లకు ఉద్యోగోన్నతులు దక్కాయి. ఆర్జేడీ బి.విజయభాస్కర్, ఉమ్మడి జిల్లా నోడల్ అధికారి ఎన్.ప్రేమ్ కుమార్ పర్యవేక్షించారు. ప్రమోషన్ పొందిన స్కూల్ అసిస్టెంట్లు అంతా ప్రస్తుతం పనిచేస్తున్న పాఠశాలల నుంచి ఈ నెల 31న రిలీవ్ అయి, 1న హెచ్‌ఎంగా బాధ్యతలు తీసుకోవాలని విద్యాశాఖాధికారులు ఆదేశించారు.



కౌన్సెలింగ్‌ను పర్యవేక్షిస్తున్న ఆర్జేడీ విజయభాస్కర్



పదోన్నతి కౌన్సెలింగ్‌కు హాజరైన ఉపాధ్యాయులు

సాంకేతిక చిక్కులతో జాప్యం

గ్రేడ్–2 హెచ్‌ఎం ప్రమోషన్స్ జాబితాలో ఉన్న ఉపాధ్యాయులంతా విశాఖ నగరంలోని సీతమ్మధారలో ఉన్న ఎస్ఎఫ్ఎస్ స్కూల్‌కు గురువారం ఉదయం 10 గంటలకే చేరుకున్నారు. కౌన్సెలింగ్ మాత్రం సాయంత్రం 6 తర్వాత ప్రారంభమై, రాత్రి 10 వరకు కొనసాగింది. జిల్లా విద్యాశాఖాధికారులు సీనియార్టీ జాబితా సిద్ధం చేసినప్పటికీ, కమిషనరేట్ నుంచి గురువారం సాయంత్రం వరకు ప్రమోషన్స్ కౌన్సెలింగ్‌కు గ్రీన్‌సిగ్నల్ రాలేదు. పదోన్నతుల రోస్టర్ కూర్పుపై కొందరు ఉపాధ్యాయులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. సాంకేతిక సమస్యల కారణంగా దీనిపై కమిషనరేట్ నుంచి సకాలంలో ఆమోదం లభించకపోవటంతో ఇక్కడి అధికారులు నిరీక్షించక తప్పలేదు.

సిద్ధమైన ఎస్ఏ, ఎస్జీటీల జాబితాలు

స్కూల్ అసిస్టెంట్, సెకడరీ గ్రేడ్ టీచర్ల(ఎస్జీటీ) బదిలీలు భారీగానే ఉంటాయని విద్యాశాఖాధికారులు అంచనా వేస్తున్నారు. బదిలీ కోసం వచ్చిన దరఖాస్తులను ఉమ్మడి జిల్లా నోడల్ అధికారి ఎన్.ప్రేమ్ కుమార్ పర్యవేక్షణలో వడపోతను ముమ్మరం చేస్తున్నారు. షెడ్యూల్ మేరకు స్కూల్ అసిస్టెంట్ల బదిలీలు పూర్తయ్యాక, అందుబాటులో ఉన్న ఖాళీల మేరకు అర్హులైన ఎస్జీటీలకు పదోన్నతులిస్తారు. అనంతరం ఎస్జీటీలకు బదిలీలు నిర్వహిస్తారు.

పుట్టెడు దుఃఖంలోనూ..

బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ అంతా ఉమ్మడి జిల్లా నోడల్ అధికారిగా విశాఖ డీఈవో ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో జరుగుతోంది. ఆయన మామయ్య తీవ్ర అనారోగ్యంతో వారం రోజులుగా చెన్నైలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మరణించారు. సమాచారం తెలిశాక పుట్టెడు దుఃఖంలోనూ ప్రమోషన్స్, బదిలీలపై ఇక్కడి యంత్రాంగానికి దిశానిర్దేశం చేసి, ఉన్నతాధికారుల అనుమతితో అప్పటికప్పుడు బయలుదేరి వెళ్లారు.

డీటీవో భవనం మెట్లు కూలి ఒకరికి గాయాలు

కొత్త భవనం ప్రారంభోత్సవంపై కలెక్టర్ ఆరా



గాయాలపాలైన ప్రసాద్

మహారాణిపేట: కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో ఉన్న జిల్లా ట్రెజరీ కార్యాలయం(డీటీవో) మెట్లు పాక్షికంగా కూలిపోయాయి. రెండు రోజులుగా కురిసిన వర్షాలకు ట్రెజరీ కార్యాలయానికి వెళ్లే ఐరన్ మెట్లలో ఓ భాగం పడిపోయింది. ఈ ఘటనలో ఆఫీస్ సబార్డినేట్ ప్రసాద్ తలకు గాయమైంది. తృటిలో ప్రాణాపాయం తప్పిందని సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

వర్షం కురిస్తే భయం

ఎప్పుడు వర్షం కురిసినా ట్రెజరీ కార్యాలయ పరిస్థితి దారుణంగా ఉంటుంది. 2014లో వచ్చిన హుద్‌హుద్ తుపానుకు పూర్తిగా ధ్వంసమైన భవనంలోనే ఇప్పటికీ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. వర్షం పడితే ఆ భవనంలో ఉండేందుకు భయపడే పరిస్థితి. కొన్ని రోజుల క్రితం ఇదే కార్యాలయానికి చెందిన ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్ పూర్తిగా కూలిపోయింది. సిబ్బంది విధుల్లో లేని సమయంలో ఆ సంఘటన జరగడంతో ప్రాణనష్టం వాటిల్లలేదు. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం కార్యాలయ మార్పునకు చొరవచూపట్లేదు.



కూలిపోయిన ఇనుప మెట్లు

పక్కనే పక్కా భవనం..!

జిల్లా ట్రెజరీ కార్యాలయానికి నూతన భవనాన్ని జిల్లా పరిషత్ పక్కన నిర్మించారు. ఎలక్ట్రిక్, చిన్నచిన్న పనులు మినహా భవనం సిద్ధంగా ఉంది. అయినప్పటికీ వివిధ సాంకేతిక కారాణాల పేరిట ఇంకా దీన్ని ప్రారంభించలేదు. తాజా ఘటనతో జిల్లా ట్రెజరీ అధికారి వై.సుధాకర్ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ దృష్టికి కార్యాలయ సమస్యను తీసుకెళ్లారు. దీంతో కలెక్టర్ స్పందించి కొత్త భవనం ప్రారంభోత్సవానికి ఉన్న ఆటంకాలపై ఆరా తీశారు.

మెరిసిన జ్యోతి



విశాఖస్పోర్ట్స్: భారత మహిళా అథ్లెట్, విశాఖ అమ్మాయి జ్యోతి ఎర్రాజీ మరోసారి తన సత్తా చాటింది. 26వ ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో వంద మీటర్ల హార్డిల్స్‌లో అద్భుతమైన ప్రదర్శనతో స్వర్ణ పతకం సాధించడమే కాకుండా, చాంపియన్‌షిప్ రికార్డును కూడా బద్దలు కొట్టింది. కొరియాలోని గుమిలో గురువారం జరిగిన ఈ పోటీలో జ్యోతి కేవలం 12.96 సెకన్లలో లక్ష్యాన్ని చేరుకుని విజేతగా నిలిచింది. ఈ గెలుపుతో పాటు 1998లో చైనాకు చెందిన యున్ ఫెంగ్ నెలకొల్పిన 12.97 సెకన్ల రికార్డును జ్యోతి అధిగమించింది. ఫైనల్స్‌లో పాల్గొన్న మిగిలిన ఏడుగురు అథ్లెట్లు 13 సెకన్ల కంటే ఎక్కువ సమయం తీసుకోగా.. జ్యోతి 13 సెకన్ల లోపే పూర్తి చేయడం విశేషం. జపాన్‌కు చెందిన యుమి తనాకా (13.07 సెకన్లు) రెండో స్థానంలోనూ, చైనాకు చెందిన వు యన్ని (13.07 సెకన్లు) మూడో స్థానంలోనూ నిలిచారు. బుధవారం జరిగిన హీట్స్‌లో జ్యోతి 13.18 సెకన్లలో పూర్తి చేసి ఫైనల్స్‌కు అర్హత సాధించింది. ఇప్పుడు ఏకంగా స్వర్ణం సాధించి, రికార్డు బద్దలు కొట్టడం ఆమె పట్టుదలకు నిదర్శనం.



చికెన్ ధరలు

చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

ఫారం ధర	: రూ.100
బ్రాయిలర్ (లైవ్)	: రూ.120
స్కిన్	: రూ.210
స్కిన్‌లెస్	: రూ.220

కోడిగుడ్ల ధరలు

రూ.లలో (వందకు)

విశాఖ	535.00
విజయనగరం	539.00
శ్రీకాకుళం	539.00

జాబ్స్@ గైస్

ఉద్యోగ సాధనలో తగ్గేదేలే!

- ఐదేళ్లలో 732 ఉద్యోగాలు సొంతం
- సత్తా చాటుతున్న కెమికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు



ఉద్యోగాలు సాధించిన బాలురు



కెమికల్ ఇంజినీరింగ్ కాలేజ్ (గైస్)



జాబ్ అచీవర్స్ ఉత్సవంలో పాల్గొన్న విద్యార్థులు(ఫైల్)



ఉద్యోగాలు పొందిన బాలికలు

మురళీనగర్: కొలువు ఎవరి సొంతం కాదు.. సత్తా ఉంటే ఏ రంగంలోనైనా విజయం సాధించవచ్చు. ఇదే విషయాన్ని కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్(గైస్) విద్యార్థులు నిరూపిస్తున్నారు. ఒకప్పుడు ఫలానా ఇంజినీరింగ్ కోర్సులు చేస్తేనే ఉద్యోగాలు వస్తాయనే అభిప్రాయం ఉండేది. కానీ గైస్ విద్యార్థులు తమకు నచ్చిన కెమికల్ ఇంజినీరింగ్ రంగంలో రాణిస్తూ.. సులువుగా ఉద్యోగాలు సాధిస్తున్నారు. ఈ కళాశాలలో చేరితే ఉద్యోగం ఖాయమనే నమ్మకాన్ని నిజం చేస్తున్నారు. ప్రతి క్యాంపస్ డ్రైవ్‌లోనూ అత్యుత్తమ వేతన ప్యాకేజీలతో ఉద్యోగాలు పొందుతూ తమ ప్రతిభను చాటుతున్నారు.

ఐదేళ్లలో రికార్డ్ స్థాయి ఉద్యోగాలు

ఒక ప్రభుత్వ డిప్లమో కళాశాలలో పదుల సంఖ్యలో ఉద్యోగాలు రావడమే గొప్పగా చెప్పుకునే రోజుల్లో.. గైస్ విద్యార్థులు కేవలం ఐదేళ్లలో ఏకంగా 732 ఉద్యోగాలు పొందడం విశేషం. ఒకే కళాశాల నుంచి ఇంత పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు రావడం ఒక రికార్డు. వీరిలో 484 మంది బాలురు, 248 మంది బాలికలు ఉన్నారు. సంవత్సరాల వారీగా చూస్తే.. 2020-21లో 178 మంది, 2021-22లో 105 మంది, 2022-23లో 165 మంది, 2023-24లో 105 మంది, 2024-25లో 179 మంది ఉద్యోగాలు సాధించారు. ప్రతి సంవత్సరం సగటున 147 మంది విద్యార్థులు ఉద్యోగాలు పొందుతుండటం గమనార్హం. ఇక గైస్‌లో కెమికల్ ఇంజినీరింగ్‌లో నాలుగు విభాగాలు ఉన్నాయి. కెమికల్ ఇంజినీరింగ్ విభాగంలో 204 మంది, పెట్రో కెమికల్స్‌లో 183 మంది, ప్లాస్టిక్ అండ్ పాలిమర్స్‌లో 203 మంది, ఆయిల్ టెక్నాలజీలో 142 మంది ఉద్యోగాలు సాధించారు. బాలికల విషయానికి వస్తే.. కెమికల్ ఇంజినీరింగ్ విభాగంలో 76 మంది, పెట్రో కెమికల్స్‌లో 64 మంది, ప్లాస్టిక్ అండ్ పాలిమర్స్‌లో 55 మంది, ఆయిల్ టెక్నాలజీలో 53 మంది ఉద్యోగాలు పొందారు.

అధిక ప్యాకేజీల్లో బాలికల హవా

అత్యధిక వార్షిక వేతనం సాధించడంలో బాలికలు ముందంజలో ఉన్నారు. డిప్లమో స్థాయిలోనే ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లకు దీటుగా అధిక జీతాలతో ఉద్యోగాలు సాధిస్తున్నారు. ముఖ్యంగా డి.వంశీప్రియాంక (ఏసియన్ పెయింట్స్) రూ. 6.73 లక్షలు, ఎస్‌కే జఫ్రీన్ అరాఫాతి(ఏసియన్ పెయింట్స్) రూ.6 లక్షలు, ఎస్.వైశాలి(ఏసియన్ పెయింట్స్) రూ. 6 లక్షలు, జి.గీతా భవాని (అల్ట్రాటెక్ సిమెంట్స్) రూ.4 లక్షలు, ఎల్.తేజస్విని (అల్ట్రాటెక్ సిమెంట్స్) రూ.4 లక్షలు, టి.సంధ్య (టెక్నిప్ ఎనర్జీస్) రూ.3 లక్షల ప్యాకేజీతో ఉద్యోగాలు పొందారు. బాలురు కూడా మంచి ప్యాకేజీలు సాధించారు. జీఎస్‌కే చైతన్య (అల్ట్రాటెక్ సిమెంట్స్) రూ.4 లక్షలు, ఐ.మాధవరావు(ది ఆంధ్ర పెట్రో కెమికల్స్ లిమిటెడ్) రూ.3.6 లక్షలు, డి.సాయిలోకేష్ (సెయింట్ గోబెయిన్) రూ. 2.8 లక్షల వార్షిక ప్యాకేజీతో ఉద్యోగాలు పొందారు. కొన్ని కంపెనీలు వీరికి ఇతర ఆర్థిక ప్రయోజనాలు, ప్రయాణ సౌకర్యాలు, క్యాంటీన్‌లో రాయితీ భోజన సౌకర్యాలు కూడా కల్పిస్తున్నాయి.

వెయ్యి ఉద్యోగాలే లక్ష్యం



వచ్చే ఏడాది నాటికి తమ కళాశాల విద్యార్థుల ఉద్యోగాల సంఖ్య వెయ్యికి చేర్చాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. క్యాంపస్ డ్రైవ్‌కు వెళ్లిన ప్రతి విద్యార్థి ఉద్యోగం సాధించాలి. ఇందుకోసం ట్రెనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ విభాగాన్ని ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తున్నాం. మల్టీ నేషనల్ కంపెనీలు, నవరత్న కంపెనీల్లో మా విద్యార్థులు పని చేస్తున్నారు. బాలురతో పాటు బాలికలకు సమ ప్రాధాన్యమిస్తూ ఉద్యోగాల సాధనకు ప్రత్యేక కృషి చేస్తున్నాం. టెక్నికల్ ఎడ్యుకేషన్ బ్రోచర్స్, స్టడీ మెటీరియల్స్‌లో మా విద్యార్థుల ఫొటోలు ప్రచురించడం మాకు గర్వకారణం.

–డాక్టర్ కె.వెంకటరమణ, ప్రిన్సిపాల్, గైస్

ప్రేక్షకుల రుణం తీర్చుకునే చిత్రం 'థగ్ లైఫ్'



హీరోహీరోయిన్లు కమల్ హాసన్, త్రిష

బీచ్‌రోడ్: 'థగ్ లైఫ్' ఒక అద్భుతమైన సినిమా అని హీరో కమల్‌హాసన్ అన్నారు. నగరంలోని గురజాడ కళాక్షేత్రంలో గురువారం చిత్ర యూనిట్ గ్రాండ్‌గా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా కమల్‌హాసన్ మాట్లాడుతూ వైజాగ్ తనను ఎంతో ఆదరించిందన్నారు. 21 ఏళ్ల వయసులో ఇక్కడికి వచ్చిన తనకు 'మరో చరిత్ర' చిత్రం తిరుగులేని అభిమానగణాన్ని అందించిందని గుర్తు చేసుకున్నారు. ఆ తర్వాత 'ఏక్ దుజే కేలియే' చిత్రం హిందీలో విజయం సాధించినప్పుడు తెలుగు ప్రేక్షకులు ఎంతోగానో ఆనందించారన్నారు. 'సాగర సంగమం', 'ఏక్ దుజే కేలియే', 'శుభసంకల్పం' వంటి చిత్రాలు షూటింగ్‌లు ఇక్కడే జరిగాయని, ఇది తన సొంత ఇల్లు లాంటిదని ఆయన పేర్కొన్నారు. మంచి కళ ఎక్కడ కనిపించినా తాను సెల్యూట్ చేస్తానని, అందులో ఎన్నో విషయాలు నేర్చుకుంటానని కమల్ అన్నారు. తాను కొన్ని చెడు సినిమాలు కూడా చేశానని, వాటిని ప్రేక్షకులు మరిచిపోయి కేవలం మంచి చిత్రాలనే గుర్తు పెట్టుకున్నందుకు వారికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు. మంచి సినిమాలు అందించడం తన బాధ్యత అని అన్నారు. తాను నటించిన 15 తెలుగు చిత్రాల్లో 13 విజయవంతం అయ్యాయని, ఆ విజయాలన్నీ ప్రేక్షకుల వల్లే సాధ్యమయ్యాయని చెప్పారు. ఫ్లాప్‌లు మాత్రమే తన ఖాతాలో వేసుకుంటానన్నారు. ప్రేక్షకుల రుణం తీర్చుకోవడానికి 'థగ్ లైఫ్' చిత్రాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. 'థగ్ లైఫ్' చాలా గొప్ప చిత్రమని, శింబు అద్భుతమైన నటన కనబరిచారని, ఇది వరకు చూడని పాత్రలో ఆయన కనిపిస్తారని కొనియాడారు. అభిరామి కూడా అద్భుతంగా నటించారని, నాజర్‌తో తనది చాలా కాలం నుంచి ప్రయాణమన్నారు. త్రిష నటన ప్రేక్షకులను తప్పకుండా మెప్పిస్తుందని, తామంతా కలిసి ఒక గొప్ప సినిమా చేశామని నమ్ముతున్నట్లు చెప్పారు. జూన్ 5న తాము అనుకున్నది కరెక్టో కాదో ప్రేక్షకులు సినిమా చూసి చెప్పాలని కోరారు.

ఓజీ సినిమాలో పాట పాడాను..

హీరో శింబు మాట్లాడుతూ తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ మంచి సినిమాలను ఆదరిస్తారని, ఈ చిత్రం కూడా తప్పకుండా అందరికీ నచ్చుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 'ఓజీ' సినిమాలో తాను ఒక పాట పాడానని, అది త్వరలోనే విడుదల కానుందని తెలిపారు. పవన్ కల్యాణ్ నటించిన 'హరి హర వీరమల్లు' చిత్రం కూడా త్వరలో విడుదల కానుందని, ఆ చిత్రం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. హీరోయిన్ త్రిష మాట్లాడుతూ 'వర్షం' సినిమా విడుదలై 22 ఏళ్లు పూర్తయినప్పటికీ ఇప్పటికీ ఇంత అభిమానం చూపిస్తున్న ప్రేక్షకులకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు. వైజాగ్ తనకెంతో ఇష్టమైన నగరమని, 'థగ్ లైఫ్' సినిమాలో కమల్ హాసన్‌తో కలిసి పనిచేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ చిత్రంలో తాను ఇంద్రాణి అనే పాత్ర పోషించానని, ఆ పాత్ర తప్పకుండా ప్రేక్షకులకు గుర్తుండిపోతుందన్నారు. అంతకుముందు విశాఖ విమానాశ్రయంలో సినిమా బృందానికి అభిమానులు ఘన స్వాగతం పలికారు.

వైఎస్సార్‌సీపీలో జనసేన యువత చేరిక



జనసేన నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు

మద్దిలపాలెం: జీవీఎంసీ 13వ వార్డుకు చెందిన జనసేన పార్టీ యువత గురువారం వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి ఆ పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. జనసేన కార్యకర్త సంగి వాసు ఆధ్వర్యంలో పలువురు పార్టీలో చేరారు. 23వ వార్డు సీతమ్మధారలోని కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వెంకట్, రాంబాబు, శ్రీనివాస్, రాజేష్, సింహాచలం, దాసు, కృష్ణ, శివ, నాగరాజు, దుర్గ, నాగమణి పాల్గొన్నారు.

నేడు విశాఖ-కిరండూల్ పాసింజర్ రద్దు

తాటిచెట్లపాలెం: కొత్తవలస-కోరాపుట్ సెక్షన్ తైడ-చిమిడిపల్లి పరిధిలో ట్రాక్ పునరుద్ధరణ పనులు యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతున్నాయి. బుధవారం ఇక్కడ గూడ్స్ రైలు పట్టాలు తప్పిన విషయం తెలిసిందే. వాల్తేర్ డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోరా, ఏడీఆర్ఎం(ఇన్‌ఫ్రా) ఈ.శాంతారం స్వయంగా పనులను పర్యవేక్షిస్తున్నారు. పునరుద్ధరణ పనుల కారణంగా ఈ మార్గంలో ప్రయాణించే రైళ్లను శుక్రవారం రద్దు చేసినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.

రద్దయిన రైళ్లు : విశాఖపట్నం-కిరండూల్(58501) పాసింజర్, కిరండూల్-విశాఖపట్నం (58502) పాసింజర్, కిరండూల్-విశాఖపట్నం (18516) నైట్ ఎక్స్‌ప్రెస్.



31,1న విశాఖ-బ్రహ్మపూర్ ఎక్స్‌ప్రెస్ రద్దు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ నెల్లిమర్ల-గరివిడి సెక్షన్ పరిధిలో జరుగుతున్న ఆధునికీకరణ పనుల కారణంగా ఆ మార్గంలో నడిచే పలు రైళ్లను ఆయా తేదీల్లో రద్దు చేయడం, మరికొన్ని రైళ్ల గమ్యం కుదిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రయాణికులు ఈ మార్పులు గమనించాలని సూచించారు.

31న రద్దయిన రైళ్లు

- విశాఖపట్నం-బ్రహ్మపూర్(58532)పాసింజర్, విశాఖపట్నం-భవానీపట్న(58504) పాసింజర్, విశాఖపట్నం-బ్రహ్మపూర్(18526)ఎక్స్‌ప్రెస్

జూన్ 1న రద్దయిన రైళ్లు

- విశాఖపట్నం-కోరాపుట్(58538) పాసింజర్, కోరాపుట్-విశాఖపట్నం(58537) పాసింజర్, విశాఖపట్నం-రాయ్‌పూర్(58528) పాసింజర్, రాయ్‌పూర్-విశాఖపట్నం(58527)పాసింజర్, విశాఖపట్నం-బ్రహ్మపూర్(58532)పాసింజర్, బ్రహ్మపూర్-విశాఖపట్నం(58531)పాసింజర్, విశాఖపట్నం-గుణుపూర్(58506)పాసింజర్, గుణుపూర్-విశాఖపట్నం (58505)పాసింజర్, విశాఖపట్నం-భవానీపట్న(58504)పాసింజర్, భవానీపట్న-విశాఖపట్నం(58503)పాసింజర్, విశాఖపట్నం-విజయనగరం(67287) పాసింజర్, విజయనగరం-విశాఖపట్నం(67288)పాసింజర్, విశాఖపట్నం-పలాస(67289)పాసింజర్, పలాస-విశాఖపట్నం(67290) పాసింజర్, విశాఖపట్నం-బ్రహ్మపూర్(18526) ఎక్స్‌ప్రెస్, బ్రహ్మపూర్-విశాఖపట్నం(18525)ఎక్స్‌ప్రెస్

జూన్ 2న రద్దయిన రైళ్లు

- బ్రహ్మపూర్-విశాఖపట్నం(18525) ఎక్స్‌ప్రెస్, భవానిపట్న-విశాఖపట్నం(58503)పాసింజర్, బ్రహ్మపూర్-విశాఖపట్నం(58531)పాసింజర్

గమ్యం కుదించిన రైళ్లు

- 31న గుంటూరు-రాయగడ(17243) ఎక్స్‌ప్రెస్ విశాఖపట్నం వరకు మాత్రమే నడుస్తుంది.
- జూన్ 1న రాయగడ-గుంటూరు(17244)ఎక్స్‌ప్రెస్ విశాఖపట్నం నుంచి బయలుదేరుతుంది.

డాక్టర్ ఖాన్‌కు అరుదైన గుర్తింపు

ఆరిలోవ: అపోలో ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు డాక్టర్ అబ్దుల్ డి.ఖాన్‌కు అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు లభించింది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో స్పెయిన్‌లోని మాడ్రిడ్‌లో జరగనున్న ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ ఆర్థోపెడిక్ సర్జరీ అండ్ ట్రామాలజీ (సికోట్) ఆర్థోపెడిక్ వరల్డ్ కాంగ్రెస్‌కు ఆయన పంపిన మూడు పరిశోధనా కథనాలు ఎంపికయ్యాయి. ఈ విషయాన్ని డాక్టర్ అబ్దుల్ ఖాన్ గురువారం వెల్లడించారు. భుజం స్నాయువు చికిత్సలో రిజినేటిస్ బయో ఇంప్లాంట్ వినియోగం, మోకాలి పాక్షిక ఏసీఎల్ చీలిక కోసం ఆర్ఎఫ్‌టీఎస్ విధానం, అలాగే మోకాలి ఆస్టియో ఆర్థరైటిస్‌కు బీఎంఏసీ ఇంజెక్షన్ల ద్వారా చేసిన ఆర్థ్రోస్కోపిక్ శస్త్రచికిత్సలకు సంబంధించిన మూడు ప్రత్యేక శాస్త్రీయ కథనాలను తాను సికోట్‌కు పంపినట్లు తెలిపారు. అత్యాధునిక శస్త్రచికిత్సలకు సంబంధించిన పరిశోధన కావడంతో సికోట్ కాంగ్రెస్ సైంటిఫిక్ కమిటీ ఈ కథనాలను ఆమోదించిందని డాక్టర్ ఖాన్ పేర్కొన్నారు. ఈ మేరకు కమిటీ నుంచి తనకు లేఖ అందిందని సంతోషం వ్యక్తం చేశారు. అరుదైన పరిశోధన కథనాలు అంతర్జాతీయ వేదికపై గుర్తింపు పొందడం పట్ల అపోలో ఆసుపత్రి వైద్యులు డాక్టర్ అబ్దుల్ ఖాన్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

ఉక్కు కార్మికులకు హెచ్ఆర్ఎఫ్ సంఘీభావం

విశాఖ సిటీ: విశాఖ స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికుల పోరాటానికి మానవ హక్కుల వేదిక(హెచ్ఆర్ఎఫ్) సంఘీభావం ప్రకటించింది. తొలగించిన 3 వేల మంది కాంట్రాక్టు కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని హెచ్ఆర్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కె.వి.జగన్నాథరావు, సమన్వయ కమిటీ సభ్యుడు వి.ఎస్.కృష్ణ డిమాండ్ చేశారు. తొలగింపునకు సిద్ధం చేసిన 1,800 మంది కార్మికులను విధుల్లో కొనసాగించాలని పేర్కొన్నారు. కాంట్రాక్టు కార్మికులు సమ్మె చేయడంతో ఉత్పత్తి కుంటుపడుతుంటే.. వారి సమస్యలు పరిష్కరించాల్సిన విశాఖ ఉక్కు యాజమాన్యం పోలీసులతో భయభ్రాంతులకు గురి చేయడాన్ని ఖండించారు. పరిశ్రమకు రూ.11,440 కోట్లు ప్యాకేజీ ఇచ్చి, జీఎస్టీ, ఇతర అప్పులు లేకుండా చేసి ప్రైవేటు వ్యక్తులకు ఈ పరిశ్రమను అప్పజెప్పాలని కుట్ర చేస్తున్నట్లుగా మానవ హక్కుల వేదిక భావిస్తోందని తెలిపారు. న్యాయమైన సమస్యలపై పోరాడుతున్న కార్మికులను సస్పెన్షన్లు, షోకాజ్ నోటీసులతో నిలువరించడం పారిశ్రామిక వివాదాల చట్టం 1948 ఉల్లంఘనగా పేర్కొన్నారు. ఇటువంటి అప్రజాస్వామిక చర్యలు వెంటనే నిలుపుదల చేసి కార్మికుల సమస్యలు పరిష్కరించి, కర్మాగారంలో శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పాలని డిమాండ్ చేశారు.

జూన్ 9న వర్కింగ్ జర్నలిస్టుల ఆందోళన



నూతన వెబ్‌సైట్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ ప్రకటన

విశాఖ విద్య: జర్నలిస్టులకు సంబంధించిన రెండు కీలక చట్టాలను కేంద్రం రద్దు చేయడాన్ని నిరసిస్తూ జూన్ 9న రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తున్నట్లు ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకటరావు, ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు ప్రకటించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్లాటినం జూబ్లీ హాలులో గురువారం ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రం ఇటీవల 44 కార్మిక చట్టాలను రద్దు చేసిందని, అందులో రెండు జర్నలిస్టులకు సంబంధించినవి ఉన్నాయన్నారు. వర్కింగ్ జర్నలిస్టుల చట్టం 1955, వేతనాల చెల్లింపులు చట్టం 1958 రద్దు చేసిన వాటిలో ఉన్నట్లు వెల్లడించారు. వీటిని తక్షణమే పునరుద్ధరించాలనే డిమాండ్‌తో జూన్ 9న నిర్వహించే జాతీయ కార్మిక సంఘాల ఆందోళనలో జర్నలిస్టులు కూడా పాల్గొనాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, లేని పక్షంలో దశలవారీగా ఆందోళన తప్పదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావస్తున్న నేటికి కొత్త అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయలేదన్నారు. అలాగే జర్నలిస్టులు ఇళ్ల స్థలాలకు సైతం నోచుకోలేదన్నారు. పెన్షన్ పథకం అమలు చేయాలని, మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని, ప్రమాద బీమా పునరుద్ధరించాలని తీర్మానించారు. రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో చేసిన తీర్మానాలను త్వరలోనే ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. సమావేశంలో భాగంగా వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, బ్రాడ్‌కాస్ట్‌కు సంబంధించిన నూతన వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ విశాఖ వేదికగా త్వరలో రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఎన్ఏజే సెక్రటరీ జనరల్ ఎం.కొండయ్య, జెండర్ ఈక్విటీ కౌన్సిల్ చైర్మన్ కె.మంజరి, ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు పి.నారాయణ, కార్యదర్శి జి.శ్రీనివాసరావు, బ్రాడ్‌కాస్ట్ అధ్యక్షుడు ఇరోతి ఈశ్వరరావు, కార్యదర్శి కె.మదన్, చిన్న మధ్య తరహా పత్రికల సంఘం అధ్యక్షుడు జగన్‌మోహన్, కె.శ్రీనివాస్ రావు, పలు జిల్లాల ఫెడరేషన్ నేతలు పాల్గొన్నారు.

అప్పుడు 18.. ఇప్పుడు 65

- టెన్త్ మూల్యాంకనంలో విచిత్రం
- సోషల్ పేపర్ రీ వాల్యుయేషన్‌లో ఫస్ట్ క్లాస్ మార్కులు
- ఎస్ఎస్‌సీ బోర్డు నిర్వాకంతో గురుకుల విద్యార్థికి తీవ్ర వేదన



దేవరాపల్లి: ఈ ఏడాది జరిగిన పదో తరగతి పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనంలో జరిగిన తప్పిదంతో ఓ విద్యార్థి తీవ్ర వేదనకు గురయ్యాడు. రీవాల్యుయేషన్‌లో ఫెయిల్ కాదు.. ఫస్ట్ క్లాస్ అని తేలింది. దేవరాపల్లి మండలం తెనుగుపూడి డా. బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల విద్యార్థి లింగాల ఆకర్ష్ ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు రాశాడు. ఎస్ఎస్‌సీ బోర్డు విడుదల చేసిన ఫలితాల్లో అన్ని సబ్జెక్టుల్లో పాస్ కాగా సాంఘిక శాస్త్రంలో కేవలం 18 మార్కులు మాత్రమే వచ్చాయి. దీంతో విద్యార్థితోపాటు తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు. మూల్యాంకనంపై అనుమానం వచ్చి విద్యార్థి తల్లిదండ్రులు ఎస్ఎస్‌సీ బోర్డుకు రూ.1000 చలానా చెల్లించి సోషల్ పేపర్ జవాబు పత్రాన్ని రీ వాల్యుయేషన్ చేయించారు. పునర్ మూల్యాంకనంలో 65 మార్కులు వచ్చాయంటూ ఎస్ఎస్‌సీ బోర్డు నుంచి లింగాల ఆకర్ష్ ఫోనుకు సమాచారం వచ్చింది. అంతే కాకుండా అతని జవాబు పత్రంలోని పేజీలను పంపించారు. దీంతో తన కుమారుడు పరీక్షల్లో ఫెయిల్ కాలేదని, పాసయ్యాడని తెలిసిన అతని తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. మూల్యాంకనంలో నిర్లక్ష్యంతోనే ఇటువంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని, విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడటం సరికాదని బాధిత విద్యార్థి తల్లిదండ్రులతో పాటు పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

దివీస్ ఉద్యోగి ఆత్మహత్య

తగరపువలస: భీమిలి మండలం టి.నగరపాలెంలోని అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న దివీస్ ఉద్యోగి మజ్జి రామకృష్ణ (30) గురువారం సాయంత్రం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న మరొక వ్యక్తి గ్యాస్ సిలిండర్ కోసం రామకృష్ణ ఇంటి తలుపు తట్టగా.. లోపల ఉరి వేసుకుని కనిపించాడు. దీంతో ఆయన భీమిలి పోలీసులకు సమాచారం అందించారు. కృష్ణా జిల్లా హనుమాన్ జంక్షన్‌కు చెందిన రామకృష్ణ భీమిలి మండలం దివీస్ లేబొరేటరీలో కెమిస్ట్ విభాగంలో ఉద్యోగి. అతనికి పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టానికి చెందిన నవ్య అనే మహిళతో వివాహం అయింది. వీరికి 4, 6 ఏళ్ల వయసున్న ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రామకృష్ణ ఆత్మహత్య చేసుకున్న సమయంలో ఇంట్లో ఎవరూ లేరు. పిల్లలతో కలిసి అతని భార్య పుట్టింటికి వెళ్లినట్లు తెలిసింది. రామకృష్ణ మనస్తాపంతోనే ఉరి వేసుకున్నట్టు ప్రాథమిక సమాచారం. పోస్టుమార్టం నిమిత్తం అతని మృతదేహాన్ని పోలీసులు భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

• నిన్న ఇసుక.. నేడు రాళ్లు.. రేపు.?





సాగరతీరంలో కొన్ని గంటల్లో చోటుచేసుకున్న అనూహ్యమైన మార్పులు ఆందోళన కలిగిస్తున్నాయి. అంబికా సీ గ్రీన్ హోటల్ ఎదురుగా ఉన్న బీచ్ రోడ్డు ప్రాంతంలో బుధవారం కనిపించిన దృశ్యం.. ఒక్క రాత్రిలోనే పూర్తిగా మారిపోయింది. నిన్నటి వరకు ఇసుక మేటలతో నిండి ఉన్న ఈ ప్రాంతం.. గురువారం ఉదయానికి కెరటాల తీవ్రతకు ఇసుకంతా కొట్టుకుపోయింది. ఇప్పుడు అక్కడ గతంలో వేసిన రాళ్లు దర్శనమిస్తున్నాయి. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే మరో రెండు రోజుల్లో తీరంలోని కొబ్బరి వనాలకు కూడా తీవ్రమైన ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. గతంలోనూ ఇదే ప్రాంతం భారీగా కోతకు గురైన విషయం తెలిసిందే. అప్పట్లో అధికారులు యుద్ధ ప్రాతిపదికన మట్టి, రాళ్ల డంపింగ్ చేసి తాత్కాలికంగా కోతను నివారించారు. అయితే ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు మరింత ఆందోళనకరంగా ఉన్నాయి. అధికారులు తక్షణమే స్పందించి, తగిన చర్యలు చేపట్టాలని పర్యాటకులు కోరుతున్నారు. – ఏయూ క్యాంపస్

సంద్రం.. కల్లోలం



ఏయూక్యాంపస్: రుతుపవనాల ఆగమనం నేపథ్యంలో వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. దీంతో సముద్ర తీరం అల్లకల్లోలంగా కనిపిస్తోంది. కెరటాలు సాధారణ స్థాయిని మించి ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. అంతేకాకుండా తీర ప్రాంతంలోని రోడ్లపై తేమ ప్రభావం అధికంగా ఉంది.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



తేమతో నిండిన బీచ్‌రోడ్డు